# చర్మాసనముల ఆవశ్యకత

పూర్వము మహర్షులు సహితము యోగదండము జింక, చర్మము చేత ధరించి తిరిగినారని అందరికి తెలుసు. యోగదండము లేనిది యోగమాచరించుట కష్టమని తెలుసుకున్నాము. ఇక మహర్షులు చర్మములు ఎందుకు ఉపయోగించుచుండిరి అను విషయమును తెలుసుకొందాము. యోగము ఆచరించువేళ బ్రహ్మశక్తి లేక యోగశక్తి శరీరమునందు ప్రవేశించుచుండును. ఈ విధముగా ప్రవేశించు శక్తి శరీరమున బ్రహ్మనాడిని చేరి సప్తస్థానమైన సహస్రారచక్రమున గుంపుగా కూడుకొనుచుండును. సహస్రారమున గుంపుగా చేరిన శక్తినే విష్ణు, ఈశ్వర పటములయందు వారి తల వెనుక భాగమున వెలుగురూపమున చిత్రీకరించడము జరుగుచున్నది. తల వెనుకభాగమున వెలుగు చిత్రీకరించిన ఎడల అది వారి యొక్క జ్ఞానశక్తి అని తెలియవచ్చును. ఈ ప్రకాశశక్తిని దేవతలు పద్ధతి ప్రకారము యోగమును ఆచరించి సంపాదించుకొన్నారు. పద్ధతియనగా యోగదండము ఉపయోగించి, చర్మము ఉపయోగించి చేయడము. చర్మము ఉపయోగించు రహస్యమేమనగా? వివరింతును వినుము.

యోగి బ్రహ్మయోగము ఆచరించువేళ జ్ఞానశక్తి అతనియందు ప్రవేశించుచుండును. శరీరమున ప్రవేశించిన శక్తి బ్రహ్మనాడిని చేరి, ఊర్ధ్వముగా ప్రయాణించి, తలయందుకల ఏడవచక్రమున చేరుచుండును. అట్లు చేరువేళ క్రింద భూమ్యాకర్షణశక్తి వలన కొంత యోగశక్తి బ్రహ్మనాడి ద్వారా క్రిందికి ఆకర్షింపబడి గుదస్థానమునందుకల ఆధార కమలమను నాడీకేంద్రము నుండి భూమిని చేరుచుండును. కాని యోగి యోగము చేయునపుడు శక్తినంతయు భూమి ఆకర్షించుకొనదు. కేవలము సగము మాత్రము నష్టపోవుట జరుగుచున్నది. అర్ధభాగము మాత్రము భూమియందు ప్రవేశించిన ఆ శక్తి తిరిగి శూన్యమున మిళితమగు చుండును. భూమికి ఇటువంటి శక్తి ఉన్నదని మన పెద్దలు ఏనాడో తెలుసుకొని, వారు బ్రహ్మయోగము చేయు సమయమున చర్మ ఆసనములను ఉపయోగించుచుండిరి. చర్మమును భూమిమీద పరచి దానిమీద యోగి కూర్చున్న, యోగి శరీరమునందు ప్రవేశించు శక్తిని భూమి లాగుకొనలేదు. గోడను దాటి సూర్యకిరణములు ఏలా పోలేవో అట్లే చర్మమును దాటి శక్తి పోలేదు. శక్తికి చర్మము నిరోధము. దేశములో చర్మము తప్ప ఏ వస్తువులు శక్తిని నిరోధించలేవు. చాపమీద కూర్చున్న, మంచముమీద కూర్చున్న, ఎక్కడ కూర్చున్న శక్తి తప్పక నష్టమగును. చర్మము మీద కూర్చున్న యోగి యొక్క శక్తి ఏమాత్రము నష్టపడదు.

భూమి పంచభూతములందు ఒకటి కావున దీనికి విచిత్రమైన ఆకర్షణాశక్తి ఉన్నది. పైకెగిరిన వస్తువును మాత్రము భూమి తన వైపు ఆకర్షణవల్ల లాగుకొన్నట్లు యోగి యోగము చేయువేళ అనగా యోగ శక్తి శరీరములో ప్రవేశించువేళ మాత్రమే శక్తిని తనవైపు లాగుకొనును. భూమి తన మీదనున్న వస్తువును కదల్చలేనట్లు సహస్రారచక్రమున చేరిన శక్తిని ఏమాత్రము ఆకర్షించుకోలేదు. దీనినిబట్టి యోగి యోగము చేయువేళ మాత్రమే శక్తి నష్టపోవుటకు వీలున్నది. మిగత సమయములందు నష్టపోవుటకు వీలులేదని తెలియుచున్నది.

యోగి యోగించు సమయమున అర్ధభాగము శక్తియే ఎందుకు నష్టపోవును. నష్టపోవుశక్తి సగముకంటే ఎక్కువో! లేక తక్కువో! ఎట్లు చెప్పనగును? అన్న సంశయము కొందరికి రావచ్చును. దానికి సమాధానము, శక్తి శరీరమునందు ప్రవేశించి బ్రహ్మనాడిని చేరుచుండును కదా!. బ్రహ్మనాడిలో నాభి స్థానమును మొదలుకొని క్రింది ప్రక్క ప్రవేశించు శక్తిని అంతయు భూమి లాగుకొనును, నాభి స్థానము మొదలుకొని పైన ప్రవేశించు

శక్తిని భూమి లాగుకొనలేదు. నాభికంటే పైన ప్రవేశించు శక్తిని లాగుకొనుటకు భూమికి ఆకర్షణ బలము తక్కువ వచ్చును. కావున ఆరు చక్రములలో మూడు చక్రములవరకే భూమ్యాకర్షణశక్తి పారును. కాబట్టి యోగి సగభాగము శక్తిని మాత్రము నష్టపోవుటకు వీలున్నది. ఆసనములో చర్మమును ఉపయోగించినట్లయితే యోగశక్తి చర్మమును దాటిపోలేదు. భూమ్యాకర్షణ చర్మమును దాటిలాగలేదు. విద్యుశ్ఛక్తిని రబ్బరు ఎట్లు నిరోధించుచున్నదో అట్లే భూమ్యాకర్షణ శక్తిని నిరోధించుచున్నది.

పూర్వకాలమున యోగులందరు చర్మమునుపయోగించి శక్తిని ఏమాత్రము నష్టపోక గొప్ప శక్తిపరులైనారు. ఈ కాలమున చర్మము యొక్క ప్రత్యేకత తెలియనివారు, చర్మములతో అవసరము ఏమున్నది? అని వాదించుచున్నారు. అవసరములేనిదే గీతయందు ఆత్మ సంయమ యోగములో యోగి జింక చర్మము మీద కూర్చోవలయునని భగవంతుడు ఎందుకు చెప్పాడు? ఈ కాలములో యోగదండములు, జింక చర్మములు నాగరికతలేని పాతకాలపు పద్ధతులని అనువారు కూడ ఉన్నారు. పాతకాల పద్ధతులతో పాతకాలము వారు పలికిన పలుకులకు ప్రకృతియే తలక్రిందులు అయ్యేంతపని జరిగేది. కాని క్రొత్త కాలములో క్రొత్త పద్ధతుల ద్వారా వీరు సాధించినదేదో తెలియకున్నది. శివుడు చర్మమును ఎల్లప్పుడు తన నడుముకు చుట్టుకొనెడి వాడు. వశిష్ఠుడు, విశ్వామిత్రుడు మొదలగు మహామునులు చర్మమును, యోగదండమును ప్రక్కనే యుంచుకొని ఎంతో భద్రముగా చూచుకొనెడివారు. కానీ ఈ కాలములో అంత పవిత్రమైన వస్తువులు ఏమాత్రము మానవులయందు విలువ లేకుండ పోయినాయంటే మానవుడు దిగజారి పోతున్నాడన్నమాట.

యోగశక్తిని నిరోధించుటకు ఒక జింక చర్మమేనా పనికి వచ్చునది అను ప్రశ్న కొందరికి కలుగవచ్చును. అందులకు సమాధానము ఏమనగా? యోగి శరీరమునకు ఇతరముగా ఉన్న ఏ జీవరాసి శరీర చర్మమైనా శక్తిని నిరోధించు బలము కలిగి ఉండును. ఆ చర్మము సజీవముగానైన ఉండవచ్చును లేక నిర్జీవముగానైన ఉండవచ్చును. అందువలననే పూర్వము శివుడు ఒక్కొక్కపుడు ఏనుగు చర్మము ధరించెడివాడు, మరియు పులి చర్మమును కూడ ధరించెడి వాడు, ఇంకనూ జింక చర్మము కూడ ధరించెడివాడు. దీనిని బట్టి ఏ జీవరాసి చర్మమైన ఒక్కటే అనుమాట తెలియుచున్నది. క్రైస్తవ మతకర్త అయిన ఏసుప్రభువు యొక్క గురువుగారైన యోహాను ఒంటె చర్మము ధరించెడివాడు. శ్రీ మహావిష్ణువు బ్రతికిన పాము మీద ఎడమ చేతి మీదుగా మరియు కుడిచేతి మీదుగా పవళించుచు సూర్య చంద్రనాడులను మార్చుచు యోగము చేసినట్లు తెలియుచున్నది. పాముమీద పవళించినాడు కావున పాము చర్మము శక్తిని నిరోధించుచున్నది. ఇట్లు పరిశీలించిన సజీవములైనా సరే లేక నిర్జీవములైనా సరే చర్మము తప్పనిసరిగా ఉండవలయునని తెలియుచున్నది. కాని ఈ కాలమున మనము అహంకార యుక్తులమై అంతయు తెలియుననుచు, ఎవరైన చెప్పినను దానిని కించపరుస్తూ అధోగతిపాలగుచున్నాము. విష్ణు, ఈశ్వర, మహర్షులకంటే మనము పెద్దవారమా! చూపులేని గ్రుడ్డివాడుపోయి గుంతలో పడినట్లు జ్ఞానదృష్టిలేని మానవులు మాయ అను గుంతలో పడి, దానిలో మునిగి తేలి ప్రతి దినము ప్రతివాడు చేయు పనులనే చేయుచు, ఏమాత్రము పరమాత్మ మార్గమును గుర్తించక ఉన్నారు. తెలియని దానిని తెలిపినవాడు, కనిపించని దానిని చూపించినవాడు, అజ్ఞానములో జ్ఞానమిచ్చినవాడు, చీకటిలో దీపమై వచ్చినవాడు "గురువు" అని నమ్మి గురుసేవయందు జీవితమును సార్థకత చేసుకొని, జ్ఞానదృష్టిని సంపాదించుకొని సర్వజ్ఞుడవు కావలయునని కోరుచున్నాను.